క్లుప్తంగా

వరద వస్తుందని ధర్నా



రోడ్డుపై ధర్నా చేస్తున్న కాలనీవాసులు

ఝరాసంగం(జహీరాబాద్): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు తమ ఇళ్లలోకి వరద చేరుతోందని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డుపై ధర్నాకు దిగారు. మంగళవారం మండల పరిధిలోని మాచ్నూర్ గ్రామంలో జహీరాబాద్ వెళ్లే ప్రధాన రహదారిపై రోడ్డుకు అడ్డంగా కట్టెలు వేసి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షం కురవడంతో వరద నీటితో పాటు మురికి నీరు ఇళ్లలోకి వస్తుందన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని వాపోయారు. కాలనీలోని ఇళ్ల మధ్య ఉన్న రహదారులపై, ఇళ్లలోకి నీరు రావడంతో పనులు చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు.

భూసమస్యను పరిష్కరించండి

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం పట్టణ పరిధిలోని సర్వేనం.1, జంగంపేట సర్వేనం 376 భూబాధితులకు నష్టపరిహారం అందేలా కృషి చేయాలని బాధిత రైతులు, స్థానిక నాయకులు మంగళవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. తమ భూమిని కోల్పోయి ఎలాంటి ఆధారం లేక రోడ్డున పడే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల గోడును విన్న తహసీల్దార్ దేవదాసు త్వరలో సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, బ్రహ్మేందర్‌గౌడ్, అనిల్, రైతుల రమేశ్, అశోక్, మల్లేశ్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ యూనిఫాం అందజేత

కల్హేర్(నారాయణఖేడ్): విద్యార్థుల తల్లిదండ్రులు చందాలు చేసి ఇచ్చిన డబ్బులతో స్పోర్ట్స్ యూనిఫాం తయారు చేశారు. మంగళవారం సిర్గాపూర్ మండలం కిషన్‌నాయక్ తండా పాఠశాలలో ఎంఈఓ నాగరం శ్రీనివాస్ యూనిఫాం అందజేశారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి తల్లిదండ్రుల ఆశయం నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు దేశ్‌పాండే, సునీత, టీచర్లు రమేశ్, పండరి, సీఆర్‌పీ శివకుమార్ పాల్గొన్నారు.

శిథిల ఇళ్లు కూల్చివేత



జేసీబీతో కూల్చేస్తున్న ఇళ్లు

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని శిథిలావస్థకు చేరిన ఇళ్లను మంగళవారం యజమానులకు నోటీసులు ఇచ్చి అధికారులు కూల్చేశారు. పాత పట్టణంలోని పలు ఇళ్లు రోడ్ల పక్కన ఉండి పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. వాటి యజమానులు ఖాళీ చేసి నిరుపయోగంగా ఉంచారు. భారీవర్షాల నేపథ్యంలో ఆయా ఇళ్లు కూలి శిథిలాలు పక్క ఇళ్లపై, ముందున్న రోడ్లపై పడి ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉండటంతో కూల్చివేసినట్లు తెలిపారు.

కనీస వేతనం ఇవ్వాలి

సీఐటీయూ రాష్ట్ర నాయకుడు రాజయ్య



సమావేశంలో మాట్లాడుతున్న రాజయ్య

జిన్నారం(పటాన్‌చెరు): కాంట్రాక్ట్ కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు రాజయ్య డిమాండ్ చేశారు. మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్మిక చట్టాలను బొల్లారం, గడ్డపోతారం, బొంతపల్లి, కాజిపల్లి పారిశ్రామికవాడల్లోని పరిశ్రమల యాజమాన్యాలు అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలను పరిశ్రమలు తుంగలో తొక్కుతున్నారన్నారు. కార్మికులకు కావాల్సిన భద్రత ప్రమాణాలు, కనీస వసతులను కల్పించాలని కోరారు. లేనియెడల పరిశ్రమల వద్ద ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు భాస్కర్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్వర్లు, శ్రీరాములు, జగన్ పాల్గొన్నారు.

గురుకులాలపై ప్రభుత్వ నిర్లక్ష్యం

పుల్‌కల్(అందోల్): గురుకులాల్లో చదివే విద్యార్థులపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆరోపించారు. మంగళవారం మండలంలోని సింగూర్ గురుకుల పాఠశాలను సందర్శించి విషజ్వరాలతో బాధపడుతున్న విద్యార్థులను పరామర్శించారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో గురుకులాలు విజయవంతంగా పని చేశాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గురుకులాలపై నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. బసపూర్, మీనుపూర్ సమీపంలో సింగూర్ కెనాల్ కాల్వ గండిని పరిశీలించారు.

నల్లవాగు కాల్వకు గండి

కల్హేర్(నారాయణఖేడ్): జిల్లాలోని మధ్య తరహా ప్రాజెక్టు నల్లవాగు కుడి కాల్వకు మంగళవారం గండి పడింది. మండలంలోని బీబీపేట్ జంల తండా వద్ద కాల్వకు గండి పడింది. ప్రాజెక్టు నుంచి సాగు నీటిని విడుదల చేయడంతో నీరు పంట పొలాల్లో చేరింది. నీటి పారుదలశాఖ అధికారులు గండిని పూడ్చి కాల్వను బాగు చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. సిర్గాపూర్ మండలం కడ్పల్ చెరువుకు గండి పడటంతో రైతులు పూడ్చేశారు. నల్లవాగు ప్రాజెక్టు అలుగుపై నుంచి వరదనీరు పొంగిపొర్లుతోంది. బీబీపేట్ రామేశ్వరం చెరువు అలుగుపై నుంచి నీరు ప్రవహించాయి. వరుసగా కురుస్తున్న వానలతో పంట పొలాల్లో నీరు చేరాయి.

చీకమద్దూరు పెద్ద చెరువుకు గండి



హత్నూర: మంగాపూర్‌శివారులో మునిగిన పంటలు

హత్నూర(సంగారెడ్డి): భారీ వర్షాలకు హత్నూర మండలంలోని చెరువులు, కుంటలు నిండుకొని అలుగులు పారుతున్నాయి. మంగళవారం హత్నూర మండలం చీకమద్దూరు పెద్ద చెరువు గండి పడింది. వెంటనే స్పందించిన తహసీల్దార్ పర్వీన్ షేక్, ఎస్ఐ శ్రీధర్‌రెడ్డితో పాటు నీటిపారుదల శాఖ అధికారులతో కలసి మరమ్మతులు చేయించారు. నాగారం రొయ్యపల్లి ప్రధాన రహదారిపై వరద నీరు రావడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. దౌలాపూర్ చెరువు నిండి అలుగు పడడంతో మత్తడిదుంకి దౌలాపూర్ సికింద్రాబాద్ రహదారిపై ప్రవహించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. మంగాపూర్ దౌలాపూర్ హత్నూర చింతల్చెరు తదితర గ్రామాల్లో పంటలు మునిగిపోయాయి.



హత్నూర: చీకమద్దూర్ పెద్దచెరువు గండికి మరమ్మతులు చేసిన అధికారులు



గండిపడి వృథాగా పోతున్న నీరు

భారీ వర్షాలు.. రైతులకు కడగండ్లు

నీట మునిగిన పంటలు • పొంగిపొర్లుతున్న వాగులు వంకలు • ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన

పుల్‌కల్(అందోల్): సింగూరు పంట కాల్వకు గండ్లు పడుతుండటంతో పంట పొలాలు మునిగిపోతున్నాయి. మంగళవారం బాస్వాపూర్, మిన్‌పూర్ వద్ద గండ్లు పడ్డాయి. బస్వాపూర్ చెరువు అలుగు పారడంతో నీళ్లన్నీ కాల్వలోకి వచ్చి చేరడంతో ఉధృతి ఎక్కువై కాల్వకు గండిపడింది. దీంతో ఈ నీళ్లు పక్కనే ఉన్న పొలాల్లోకి ప్రవహిస్తుండటంతో పంటలు మునిగాయి. మిన్‌పూర్ వద్ద సింగూరు పంటకాల్వకు గండి పడి తూము చెరువులోకి వరద చేరింది. దీంతో ఆ చెరువు నిండి అలుగు పారి చెరువు ఆయకట్టు మునిగిపోయింది. వరినాట్లు వేసి పక్షం రోజులే కావడంతో పంట మునగడమే కాక చేలల్లో గండ్లు పడ్డాయి. వందఎకరాల వరకు వరి పంట మునిగిపోయిందని రైతులు వాపోయారు. వర్షాలకు తోడు పంట కాల్వ గండ్లు పడిన వరద చేలల్లోకి రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా గతవారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు, చెరువులు నిండి మత్తడి దూకుతున్నాయి. వానలకు ఆయా గ్రామాల్లోని పలువురి ఇళ్లు కూలి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల చెరువులు, కాల్వలకు గండ్లు పడి పంటలు నీట మునిగి రైతులు ఆందోళన చెందుతున్నారు.



మిన్‌పూర్ వద్ద మునిగిన పంట

మామిడి వాగు పరిశీలన

న్యాల్‌కల్(జహీరాబాద్): భారీవర్షాలు కురుస్తున్నందున ప్రజలను అప్రమత్తం చేయాలని తహసీల్దార్ ప్రభులు ఎంపీడీఓ శ్రీనివాస్, హద్నూర్ ఎస్ఐ దోమ సుజిత్ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని మామిడి వాగును మంగళవారం పరిశీలించారు. వాగు కింద భాగంలో ముళ్లపొదలు, ఇతర పిచ్చి మొక్కలు ఇరుక్కపోయి బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహిస్తుండడంతో వాటిని జేసీబీతో తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారీ వర్షాలు కురుస్తున్నందున వాగులు పొంగిపొర్లుతున్నాయని, ప్రజలు వాగులు దాటే ప్రయత్నం చేయొద్దని సూచించారు. వరదలకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే మాదృష్టికి తీసుకురావాలని ప్రజలకు తెలియజేశారు. వారి వెంట రెవెన్యూ, పంచాయతీ రాజ్ సిబ్బంది ఉన్నారు.



న్యాల్‌కల్(జహీరాబాద్): మామిడి వాగును పరిశీలిస్తున్న అధికారులు



బస్వాపూర్ వద్ద సింగూరు కాల్వకు గండి

ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి



ఫొటోగ్రాఫర్లతో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ పటాన్‌చెరు వారి ఆధ్వర్యంలో పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఫొటోగ్రాఫర్లకు ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. ఫొటోగ్రఫీ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకున్నప్పుడే మనుగడ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్, ప్రధాన కార్యదర్శి లక్ష్మారెడ్డి, మాజీ అధ్యక్షుడు కృష్ణయాదవ్, ప్రతినిధులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత జ్ఞాపకంగా నిలిపేదే ఫొటోగ్రఫీ

జహీరాబాద్: ప్రతి క్షణాన్ని శాశ్వత జ్ఞాపకంగా నిలుపగలిగేది ఫొటోగ్రఫీ మాత్రమే అని ఫొటోగ్రాఫర్ల సంఘం నాయకులు అన్నారు. మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఫొటోగ్రాఫర్లు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫొటోగ్రఫీ ఒక కళ మాత్రమే కాదు.. సమాజాన్ని ప్రతిబింబించే అద్దమని పేర్కొన్నారు. ఫొటో ఒక మధుర జ్ఞాపకాన్ని భవిష్యత్తుకు అందించే అద్భుత సాధనమన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

జోగిపేట(అందోల్): జోగిపేట పట్టణంలో మంగళవారం అందోల్ మండల ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగ్యూరె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఉలువల శ్రీనివాస్ మాట్లాడుతూ ఫొటోగ్రఫీ వృత్తిని ఎంచుకొని జీవనం సాగిస్తున్నామని, ప్రభుత్వం ఫొటోగ్రాఫర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి సంతోష్, ఉపాధ్యక్షుడు ఏజాస్, కోశాధికారి కన్నా, కార్యవర్గ సభ్యులు రాఘవేందర్, మోసయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో మహిళల పాత్ర కీలకం

మైనార్టీ మహిళల సమావేశంలో అస్మా

న్యాల్‌కల్(జహీరాబాద్): రాజకీయాల్లో మహిళల పాత్ర కీలకమైందని జహీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు అస్మా పేర్కొన్నారు. మండల పరిధిలోని మామిడ్గి గ్రామంలో మంగళవారం మైనార్టీ మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని అవి అర్హులైన మహిళలందరికీ అందేలా చూడాలన్నారు. రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం సమాజానికి ఎంతో అవసరమని స్పష్టం చేశారు. త్వరలో మహిళా మండల కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. సమావేశంలో వసీమా బేగం, సుమయ్యా, అసియా బేగం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అస్మా

ససేమిరా.. ఖాళీ చేసేదేలే..

- పాడుపడ్డ ఇంటిని ఖాళీ చేయమన్న అధికారులు
- భీష్మించుకున్న మహిళ

పుల్‌కల్(అందోల్): నాపొదరిల్లే నాకు ప్రాణం ... నా ఇంట్లో నేను ఉంటా..కూలినప్పుడు చూస్తానంటూ ఓ మహిళ అధికారులను ముప్పు తిప్పలు పెట్టింది. మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన బేగరి లక్ష్మి నగేష్ దంపతులు ఇద్దరు పిల్లలతో మట్టి గోడల ఇంట్లో నివాసం ఉంటోంది. కాగా ఎడతెరిపి లేకుండా కురుస్తోన్న భారీ వర్షాలకు ఇంటి మట్టి పెళ్లలు ఊడిపోతున్నాయి. గమనించిన అధికారులు మంగళవారం లక్ష్మి వద్దకు వెళ్లి ఇంటిని ఖాళీ చేయమని అడగ్గా ..తాను ఎక్కడకు వచ్చేది లేదని తెగేసి చెప్పింది. అధికారులు ఎంతచెప్పినా లక్ష్మి భీష్మించుకుని ఉండటంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఆమెను బలవంతంగా మరో ఇంటికి తరలించారు.



ఇంట్లో ఓ మూలన కూర్చున్న మహిళ



బయట సామాన్ల వద్ద అధికారులు

వసతి గృహాలను శుభ్రంగా ఉంచాలి

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి: వసతి గృహాలు అన్ని హంగులతో శుభ్రంగా ఉంచాలని ఎమ్మెల్యే ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ వసతి గృహాల నిర్వహణ, పరిశుభ్రత గురించి అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో సహాయ సాంఘిక సంక్షేమ అధికారి శంకర్ , వసతి గృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

ఫంక్షన్ హాల్ నిర్మాణ పనుల పరిశీలన

పటాన్‌చెరు: డివిజన్ పరిధిలోని గోకుల్‌నగర్‌లో రూ.4 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న యాదవ సంఘం కల్యాణ మండపం పనులు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొని వస్తామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయా లని జీహెచ్‌ఎంసీ ఏఈ శివకుమార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు దేవయ్య యాదవ్, వెంకటేష్ పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దుకు మహాధర్నా

వట్‌పల్లి(అందోల్): సీపీఎస్ రద్దు కోసమే పీఆర్టీయూ మహాధర్నా చేపట్టిందని ఆ సంఘం మండల అధ్యక్షుడు దిగంబర్‌రావు అన్నారు. మంగళవారం మహాధర్నా గోడపత్రికను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెన్షన్ హక్కులను కాలరాస్తున్న సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. సెప్టెంబర్ 1న జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శాఖ మండల ప్రధాన కార్యదర్శి నర్సింలు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిద్దేశ్వర్, కార్యదర్శి స్టీవెన్సన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మురళీధర్ ఉన్నారు.

‘ఆశ’లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి

జహీరాబాద్ టౌన్: ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని భీంభవన్‌లో మంగళవారం ప్రారంభమైన ఆ యూనియన్ జిల్లా మహాసభలకు ఆమె హాజరయ్యారు. మహాసభల సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..ఆశ వర్కర్లు కొన్నేళ్ల నుంచి అనేక రకాల సేవలను అందిస్తున్నారని, అయితే వీరి పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు, సహాయ కార్యదర్శి మహిపాల్, యూనియన్ నాయకులు యశోద, లక్ష్మి, శశికళ తదితరులు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న జయలక్ష్మి

చదవడం రాయడం నేర్పించాలి

ఎంఈఓ జోగప్ప

కంది(సంగారెడ్డి): 15 ఏళ్ల వయసు దాటిన వారందరికీ చదవడం, రాయడం నేర్పించేందుకు వయోజన విద్య(ఉల్లాస్) విలేజ్ కోఆర్డినేటర్లు కృషి చేయాలని ఎంఈఓ జోగప్ప పేర్కొన్నారు. మంగళవారం కందిలో వయోజన విద్య విలేజ్ కోఆర్డినేటర్లు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. 15 ఏళ్ల లోపు ఉన్నవారిని డ్రాప్ అవుట్స్‌గా గుర్తించి పాఠశాలల్లో చేర్పించుకోవాలన్నారు. అలాగే, వయోజనులందరికీ చదువు నేర్పించి ఆసక్తి గల వారికి పరీక్షలు రాయించాలన్నారు. విద్యను బోధించడంలో విలేజ్ కోఆర్డినేటర్లకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో అన్ని గ్రామాల ఉల్లాస్ విలేజ్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.



ఉల్లాస్ విలేజ్ కోఆర్డినేటర్లకు శిక్షణ కల్పిస్తున్న ఎంఈఓ జోగప్ప

ఉల్లాస్ లక్ష్య సాధనకు కృషి

రాయికోడ్(అందోల్): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంఈఓ మాణెయ్య అన్నారు. రాయికోడ్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయు లు, ఐకేపీలో పని చేస్తున్న సీసీలు, వీఓఏలకు ఉల్లాస్ కార్యక్రమంపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు.

శాంతియుతంగా పండుగలు జరుపుకోవాలి

సంగారెడ్డి క్రైమ్: వినాయక చవితి, ఈద్ మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని డీఎస్పీ సత్తయ్యగౌడ్ పేర్కొన్నారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గణేశ్ మండప నిర్వాహకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. గణేశ్ మండప నిర్వాహకులు పోలీస్‌శాఖ రూపొందించిన వెబ్‌సైట్లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. మండపాలకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జైలుశిక్ష, జరిమానా విధించిన సంఘటన పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి కథనం ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి పట్టణంలోని పాత బస్టాండ్, పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద.. బైపాస్‌లోని గుర్రపుబొమ్మ వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఐదుమందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా జిల్లా అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దిఖీ ఒకరికి రెండు రోజుల జైలుశిక్ష విధించారు. మిగతా వారికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. సోమవారం నిర్వహించిన తనిఖీల్లో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా జరిమానా విధించారు.

◆ పొంచి ఉన్న ప్రమాదం

జహీరాబాద్ టౌన్: మండల కేంద్రం మొగుడంపల్లి ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రమాదం పొంచి ఉంది. ఎర్తింగ్ తీగలకు కరెంట్ సరఫరా అవుతుంది. గ్రామానికి చెందిన కమలమ్మ మేక సోమవారం అటువైపు వెళ్తున్న క్రమంలో మూలన ఉన్న మొక్క ఆకులు తినడానికి వెళ్లింది. అక్కడే ఉన్న కరెంట్ తీగకు తాకడంతో షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదం చోటు చేసుకోక ముందే సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

◆ సమస్యలు పరిష్కరించండి

రామచంవద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్‌లోని శ్రీసాయినగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కార్పొరేటర్ బి.పుష్పను కలసి సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ.. కాలనీలో ఆలయ నిర్మాణం, థీమ్ పార్కులో పెండింగ్ పనులకు నిధులను మంజూరు చేయాలని కోరారు. అనంతరం పుష్ప మాట్లాడుతూ.. త్వరలో క్షేత్రస్థాయిలో కాలనీలో పర్యటించి పెండింగ్ పనులకు నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

◆ వేలాడుతున్న ఇంటర్నెట్, కేబుల్ వైర్ల కట్

పటాన్‌చెరు టౌన్: విద్యుత్ స్తంభాలపై వేలాడుతున్న ఇంటర్నెట్, కేబుల్ వైర్లను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కట్ చేసి తొలగిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎస్సీ శ్రీనాథ్ తెలిపారు. మంగళవారం పటాన్‌చెరు పరిధిలో విద్యుత్ స్తంభాలపై వేలాడుతున్న ఇంటర్నెట్, కేబుల్ వైర్లను టీజీఎస్పీసీడీఎల్ బృందాలు తొలగించారు. ఆయన మాట్లాడుతూ... విద్యుత్ శాఖ లైన్‌మెన్లకు కూడా విద్యుత్ సమస్య ఉన్నప్పుడు స్తంభం ఎక్కేందుకు వైర్లు ఇబ్బందికరంగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ సీఈ కామేశ్, డీఈ భాస్కర్, ఏడీఈ సంజీవ్, ఏఈ జగదీశ్ పాల్గొన్నారు.

◆ కర్చల్ పాఠశాల సందర్శన

రాయికోడ్(అందోల్): మండలంలోని కర్చల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు మంగళవారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, ప్రస్తుతం అందుబాటులో ఉన్న తరగతి గదుల సంఖ్యను హెచ్‌ఎం నర్సింలను అడిగి తెలుసుకున్నారు. అదనపు గదుల ఆవశ్యకతపై విచారించారు. పాఠశాల పరిసరాలను, నీటి వసతిని తనిఖీ చేశారు. విద్యార్థుల భద్రతకు సంబంధించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ మాణెయ్య , పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

◆ కార్యదర్శిపై చర్యలకు వినతి

నారాయణఖేడ్: మండల పరిధి కాంజీపూర్ పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేశ్ మంగళవారం గ్రామస్తులతో కలిసి ఖేడ్ ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని సమస్యలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. బోరు చెడిపోతె గ్రామస్తులే బాగు చేయించుకోవాల్సి వచ్చిందని వాపోయారు.